# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- అందరి సహకారంతో అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచానికి నమూనాగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.
- ఏడాదిన్నర కాలంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం 2 వేల 800 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని మంత్రి బీ.సీ. జనార్ధన్ రెడ్డి పేర్కొన్నారు.
- విశాఖలో ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లలో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

======================

అందరి సహకారంతో అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ ను ప్రపంచానికి నమూనాగా తీర్చిదిద్దుతామనిముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా పెదకాకానికి సమీపంలోని శంకర్ నేత్రాలయ నూతనంగా నిర్మించిన భవనాలను ముఖ్యమంత్రి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అనారోగ్యమే నిజమైన పేదరికమని, పేదరికం లేని సమాజ నిర్మాణం సాధ్యమేనని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇంటి వద్దనే ప్రపంచ స్థాయి వైద్యం అందించేందుకు సంజీవిని ప్రాజెక్టు అమలు చేస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

======================

ఏడాదిన్నర కాలంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం 2 వేల 800 కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం విజయవాడలో ఈరోజు జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వం అధికారంలో వచ్చిన 5 నెలల్లోనేఒక వెయ్యి 61 కోట్ల రూపాయలతో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు

చేశామని స్పష్టం చేశారు. మరో వెయ్యి కోట్ల రూపాయల రహదారి అభివృద్ధి పనులు టెండర్లు పిలిచే దశలో ఉన్నాయని వివరించారు. ప్రజలపై టోల్ భారం పడకుండా, పలు కీలక రహదారులను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో అభివృద్ధికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకొంటున్నారని తెలిపారు.

======================

విశాఖపట్టణం నగరంలో ఈ నెల 14, 15వ తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్ల పనుల్లో మరింత వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో జరుగుతున్న పనులను కలెక్టర్ ఈ రోజు పరిశీలించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ.. వేగంగా పనులను పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన వేదిక, స్వాగత ద్వారాలు, పార్కింగ్, వసతి తదితర అంశాలపై పనులను పర్యవేక్షిస్తున్న అధికారులతో సమీక్ష చేసి దిశ నిర్దేశం చేశారు.

======================

స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో ఆరోగ్య, ఆనంద, సంపన్న ఆంధ్రప్రదేశ్ సాధన దిశగా అడుగులు వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాక్ థాన్ ను విజయవాడ నగరంలో ఈ రోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపైఅవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటేనే స్వర్ణాంధ్ర సాధ్యమన్నారు. రక్త నాళాల వ్యాధులు, సర్జరీలు గురించి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

======================

మొంథా తుఫాను నష్టాన్ని అంచనా వేసేందుకు రేపటి నుంచి కేంద్ర ప్రతినిధి బృందం ఆంధ్రప్రదేశ్ లో పర్యటించనుంది. రెండు బృందాలుగా విడిపోయి మొంథా తుఫాను ప్రభావిత జిల్లాల్లో పర్యటించనున్నారు. కేంద్ర బృందం ముందుగా రాష్ట్ర సచివాలయంలో కార్యదర్శులు, విభాగాధిపతులతో సమావేశం అవుతుంది.మొంథా తుఫానుపై ఏర్పాటు చేసిన ప్రదర్శనను సభ్యులు తిలకిస్తారు.

విరామం

======================

సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను నగర మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి కేంద్రమంత్రి ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మిర్చి యార్డ్ వద్ద పైవంతెన పనులు వేగంగా జరుగున్నాయనిపెమ్మసాని చంద్రశేఖర్ వివరిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

======================

చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ఈ రోజు ప్రారంభించారు. పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులను తీసుకు వచ్చినట్లు ఉపముఖ్యమంత్రికి అధికారులు తెలిపారు. వీటి ద్వారా జనావాసాలు, పొలాల్లోకి వచ్చే అడవి ఏనుగులను ఎలా కట్టడి చేస్తారో వివరించారు. కుంకీ ఏనుగుల విన్యాసాలను పవన్ కళ్యాణ్ తిలకించారు.

======================

ఆంధ్రప్రదేశ్ లో పరిశ్రమల రాకతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని విద్య, ఐటి శాఖా మంత్రి నారా లోకేశ్ అన్నారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే ప్రభుత్వం ఉండడంతో బీహార్ లో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు. బీహార్ తర్వాత ఆంధ్రప్రదేశ్ కు బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం అధిక నిధులు ఇచ్చిందని పేర్కొన్నారు.

======================

తిరుమలలో ఆనవాయితీగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తూ వస్తున్న కార్తీక వన భోజన కార్యక్రమం ఈరోజు గోగర్భం సమీపంలో గల పార్వేట మండపంలో జరిగింది. ఇందులో భాగంగా మలయప్పస్వామి వారు చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకిపై ఆలయం నుంచి బయలుదేరి ఊరేగింపుగా పార్వేట మండపానికి వచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి వారికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు జరిపారు.

======================

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రేపు, ఎల్లుండి తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం మార్కెట్ యార్డ్‌లో కోటి 50 లక్షల రూపాయల విలువైన అంతర్గత రహదారుల నిర్మాణ పనులకు ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మార్కెట్యార్డులో వివిధ పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 10 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేశారని వెల్లడించారు.

======================
======================